మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

ముగిసిన పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్

- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయింపు
- త్వరలో ఎన్నికల విధులపై త్వరలో శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి
- పర్యవేక్షించిన ఎన్నికల పరిశీలకుడు

కలెక్టరేట్, ఏప్రిల్ 26 : పార్లమెంటు ఎన్నికల కోసం వినియోగించే పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ శుక్రవారం ముగిసింది. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా అధికారులు ఈ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్‌కటారియా పర్యవేక్షణలో ఈప్రక్రియ కొనసాగింది. సాఫ్ట్‌వేర్ పనితీరు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు వివరాలు సాంకేతిక మేనేజర్‌ను అడిగి తెలుసుకోగా, పూర్తి వివరాలు వెల్లడించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజ్ చేసి, కేటాయించినట్లు వెల్లడించారు. మొత్తం 5066 మంది సిబ్బందిని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలుగా బాధ్యతలు కేటాయించినట్లు స్పష్టం చేశారు. వీరికి ఎన్నికల విధుల నిర్వహణపై త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచ్చులకంటికి కృతజ్ఞతలు తెలుపుతున్న నరేట్ల సుజాత

శస్త్ర చికిత్స లేకుండానే స్టెంట్ గ్రాఫ్ట్

- అయోర్టిక్ అన్యూరిజంగా గుర్తించి ట్రీట్‌మెంట్
- యశోద హాస్పిటల్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచ్చులకంటి

విద్యానగర్, ఏప్రిల్ 26: గుండె వ్యాధితో బాధపడుతున్న మహిళకు ఓపెన్ హార్ట్ సర్జరీ తప్పని పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్ సోమాజిగూడ సీనియర్ కార్డియాలజిస్ట్ ప్రమోద్ కుమార్ కుచ్చులకంటి వైద్య పరీక్షలు నిర్వహించి అయోర్టిక్ అన్యూరిజంగా ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స లేకుండానే తొడద్వారా స్టెంట్ గ్రాఫ్ట్ వేసి పునర్జన్మను ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని యశోద సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆర్థిక భారంతో పాటు వ్యాధి తీవ్రతను తగ్గించడం సులభతరంగా ఉంటుందన్నారు. కొంతమంది పేషెంట్లు తమ దగ్గరికి వచ్చేసరికి పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంటున్నదని, అయినప్పటికీ చాలా శ్రమపడి మంచి సక్సెస్ రేట్‌ను సాధిస్తున్నామన్నారు అడ్వాన్స్ టెక్నాలజీపై చికిత్స అందిస్తున్నామన్నారు. అధునాతన చికిత్సపై అవగాహన కల్పించేందుకే ఇక్కడికి వచ్చామన్నారు. చిన్న పరీక్షలతోనే పెద్ద జబ్బులు బయటపడతాయని, నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకోవాలన్నారు. ఓపెన్ హార్ట్ చేయాల్సిన వ్యక్తికి స్టంట్ కాకుండా వాల్వు కూడా తొడ ద్వారా అమార్చే ప్రక్రియను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. యశోద సోమాజిగూడ హాస్పిటల్‌లో పదిమంది కార్డియాలజిస్టులు ఉన్నారని, అధునాతన కరెంట్ టెక్నాలజీని ఉపయోగిస్తూ లైఫ్ సేవింగ్స్ చేస్తున్నామన్నారు. గుండె వ్యాధులను ముందే గుర్తించేలా సిటీ కరోనరీ అంజియోగ్రామ్ సైతం అందుబాటులోకి వచ్చిందని, బీపీ, షుగర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ఈ పరీక్షలు చేసుకుంటే గుండె వ్యాధులను ముందే పసిగట్టవచ్చునని తెలిపారు. గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన నరేట్ల సుజాత సంవత్సర క్రితం తీవ్రంగా దగ్గు రావడంతో మంచిర్యాలలోని ఓ హాస్పిటల్‌కు వెళ్లిందని, అక్కడి వైద్యులు పరీక్షలు చేసి టీబీ జబ్బు అనే అనుమానం వ్యక్తం చేసినట్లు చెప్పారు. దాని తర్వాత సిటీ స్కాన్ పరీక్షలు చేసి, స్టెంట్ వేసుకోవాలని సూచించడంతో భయపడి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు వచ్చారని చెప్పారు. అప్పటికే పూర్తిగా ప్రాణాపాయ స్థితికి చేరిన సుజాతకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సిన అవసరం ఉన్నా ఆధునిక చికిత్స విధానం అయోటాతో తొడ ద్వారా స్టెంట్ మాదిరిగా చికిత్స అందించి రెండు మూడు రోజుల్లోనే కోలుకునేలా చేయడంతో ఇప్పుడు ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, తాను సంవత్సరం క్రితం ఎన్నో దవాఖానలకు వెళ్లినా వైద్యులు కనీసం వ్యాధి ఇది అని గుర్తించలేదని, తన ఇద్దరు పిల్లలు డాక్టర్లు కావడంతో వారు వెంటనే నాణ్యమైన వైద్యం కోసం సోమాజిగూడలోని యశోద హాస్పిటల్‌కు తీసుకువెళ్లారని తెలిపారు. అక్కడ డాక్టర్ ప్రమోద్ కుమార్ తనకు అన్ని రకాల పరీక్షలు చేసి కొత్త విధానం ద్వారా చికిత్సతో పునర్జన్మను ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Jammikunta Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to Battula Anjali, W/o: Srinivas, Age: 45 years, Occ: House hold, R/o: H.No. 5-61, Near Hanuman Temple Huzurabad village and mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 (Seven days) days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Dharmaram (P.B) village in survey number 413, a vacant house plot to an extent of 118.12 square yards its equivalent to an extent of 98.74 square meters, within the boundaries bounded on:
North: Plot of Juguru Sadanandam
South: Plot of Muduthanapally Thirupathi
East: R&B Road leads to Jammikunta to Vavilala
West: Plot of Juguru Sadanandam
Is situated Dharmram (P.B) village Jammikunta municipality limits & mandal of Karimnagar dist
Date: 26-04-2024
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Jammikunta Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to Bijjigiri Kavitha, W/o: Prabhakar, Age: 34 years, Occ: House hold, R/o: H.No. 5-2-29, Bijjigirisharief village, Jammikunta mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 (Five days) days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Jammikunta village in survey number 632, a vacant house plot total to an extent of 111.11 square yards its equivalent to an extent of 92.88 square meters, within the boundaries bounded on:
East: Plot of Mathangi Vijaya
West: 20'-00" wide NGP Road
North: House of Vendor vide H.No. 7-6-25
South: House of Dubashi Buchaiah vide H.No. 7-6-60
Is situated at Jammikunta village and municipality limits & mandal of Karimnagar dist
Date: 26-04-2024
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- భూ సమస్యతోపాటు భార్య కాపురానికి రావడం లేదని నిరసన

సెల్ టవర్ దిగివస్తున్న శ్రావణ్

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 26: భూ సమస్యతో పాటు భార్య కాపురానికి రాకపోవడంతో ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపం చెంది సెల్ టవర్ ఎక్కి హల్ చల్ చేశాడు. చివరికి పోలీసుల హామీతో కిందికి దిగాడు. మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన వడ్లూరి శ్రావణ్‌కు గ్రామ శివారులో ఐదు గుంటల వ్యవసాయ భూమి ఉండగా, దానికి దారి ఇవ్వకుండా సమీపంలోని కొందరు ఆరేండ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనికి తోడు మూడు నెలల క్రితం శ్రావణ్ భార్య ఇంట్లో గొడవ పడి, పుట్టింటికి వెళ్లిపోవడంతో అతడు తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. శుక్రవారం ఉదయం 7 గంటలకు గ్రామ సమీపంలోని సెల్ టవర్ ఎక్కి మధ్యాహ్నం 3 గంటల వరకు హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు, పోలీసులు నానా హైరానా పట్టారు. ఈ క్రమంలో సీఐ రాజ్ కుమార్ అతడితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సెల్ టవర్ దిగడంతో సమస్య సద్దుమణిగింది. పోలీసులు శ్రావణ్‌ను క్షేమంగా ఇంటికి పంపించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

బీఆర్ఎస్ ప్రచారానికి అద్భుత స్పందన

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

- పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలి
- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి
- వారికి ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఏప్రిల్ 26: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అద్భుత స్పందన వస్తున్నదని, నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సారి పార్టీ గెలుపుకోసం ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై డమ్మీ అభ్యర్థిని నిలబెట్టి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐతు కొత్తలు కూడా తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీకి ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుపోయి ఈ సారి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, పిల్లా శ్రీనివాస్, లక్ష్మయ్య, మధు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో ప్రచారం

నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మార్నింగ్ వాక్‌లో ప్రచారం చేశారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన పనులను వివరించడంతో పాటు, మళ్లీ గెలిపిస్తే చేసే అభివృద్ధిని కూడా వివరించారు. ఆయన వెంట ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు బెజుగం మధు, శ్రీనివాస్‌గౌడ్, సత్తినేని శ్రీనివాస్, తిరుపతి, రాజు తదితరులు ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్ 26: పట్టణంలో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో నిర్వహిస్తున్నామని, ప్రజలు, పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ నాయకుడు బండి సంజయ్ కుమార్ కరీంనగర్ అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదివారం సాయంత్రం చొప్పదండి పట్టణంలో నిర్వహించే కేటీఆర్ రోడ్ షోకు నియోజకవర్గంలోని ప్రజలు అత్యధికంగా తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య -వినయ్ కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు మినుపాల తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు గడ్డం చుక్కారెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు లోక్ రాజేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ కొత్తూరు మహేశ్, డాక్టర్ అమిత్ రావు, నాయకులు నల్లమాచు రామకృష్ణ, కొత్తూరు నరేశ్ , గుడిపాటి వెంకటరమణారెడ్డి, జహీర్ మావురం మహేశ్, అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాకు మాజీ మంత్రి కేటీఆర్

కార్పొరేషన్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 28న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 11 గంటలకు వేములవాడ టౌన్‌లోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో వేములవాడ నియోజకవర్గ బూత్ కమిటీ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 2 గంటలకు మానకొండూర్ నియోజకవర్గంలోని అలుగునూర్ చౌరస్తా వద్ద లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో బూత్ కమిటీ స్థాయి సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌లోని వద్ద పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో బూత్ కమిటీ స్థాయి సమావేశంలో పాల్గొంటారని, సాయంత్రం 6 గంటలకు చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో భారీ రోడ్ షోలో పాల్గొంటారని తెలిపారు.

'బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి'

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్26: అపరభగీరథుడు, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలువాలని, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి.. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కచ్చితంగా గెలవాలన్నారు. మే 2న సాయంత్రం హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణంలో సాయంత్రం రోడ్ షోకు పార్టీ అధినేత కేసీఆర్ వస్తారని, రోడ్ షో అనంతరం వీణవంకలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలతో మాట్లాడి స్థానిక పరిస్థితులు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, తరలివచ్చి బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్ట్

వీణవంక, ఏప్రిల్ 26: అక్రమంగా 2.26 ఎకరాల భూమిని సంతకాలు ఫోర్జరీ చేసి కాజేసిన ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దూలం రాజయ్య 2.26 ఎకరాల తన భూమిని అదే గ్రామానికి చెందిన మేకల మోహన్‌రెడ్డికి 1.13 ఎకరాలు, కొలిపాక రామస్వామికి 1.13 ఎకరాలు అమ్మి, రిజిస్ట్రేషన్ చేయించాడు. అది నచ్చని అదే గ్రామానికి చెందిన అతడి మేనల్లుడు బొంగోని స్వామి గతంలో డీటీగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి, ధరణి ఆపరేటర్ అరుణ్ చౌదరితో రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని తన మేన మామ భూమి కాజేయాలని పథకం పన్నాడు. మేకల మోహన్‌రెడ్డి, కొలిపాక రామస్వామికి డాక్యుమెంట్‌లు ఇవ్వకుండా వేలిముద్రలు వేయించుకొని వారిని నమ్మించి, 2.26 ఎకరాల భూమిని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు స్వామిని, ధరణి ఆపరేటర్ అరుణ్ చౌదరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించగా, మరొకరు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ఆయిల్ పామ్ నర్సరీ పరిశీలించిన రాష్ట్ర సంచాలకులు

చిగురుమామిడి, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో ఆయిల్ పామ్ నర్సరీని రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు కే అశోక్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆయిల్ పామ్ నర్సరీలో మొక్కలను పరిశీలించారు. మొక్కలకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు నాణ్యమైన మొక్కలను అందించి ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇక్కడ జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి బీ శ్రీనివాస్, డివిజనల్ ఉద్యానవన శాఖ అధికారి బీ మంజువాణి, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కన్సల్టెంట్ రంగనాయకులు, మేనేజర్ భరత్, ఉద్యాన శాఖ అధికారి రోహిత్, ఇన్‌చార్జిలు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించాలి

గంగాధర, ఏప్రిల్ 26 : ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన పండుగలా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం పార్టీ శ్రేణులకు ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామానా పార్టీ జెండాను ఎగురవేయాలని కోరారు.

నిందితులను కస్టడీకి తీసుకుని విచారణ

రాంనగర్, ఏప్రిల్ 26 : నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించుకుని మోసం చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న మూల తిరుమల్‌రెడ్డి, లంక శేఖర్‌ను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని శుక్రవారం వారి ఇండ్లలో సోదాలు జరిపి కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరిగి జైలుకు తరలించారు. గన్నేరువరానికి చెందిన తెల్ల రాజయ్య ఫిర్యాదు మేరకు నలుగురిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

కన్నకొడుకును కడతేర్చిన తండ్రి

- రోకలి బండతో తలపైకొట్టి హత్య
- చింతకుంటలో ఘటన



శివసాయి (ఫైల్)

రాంనగర్, ఏప్రిల్ 26 : కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అతడిపై కన్నతండ్రే కారంపొడి చల్లి రోకలి బండతో తలపై కొట్టి హత్య చేయడం సంచలనం రేపింది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతకుంటకు చెందిన జ్యోతి-శ్రీనివాస్ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురికి వివాహం కాగా, కొడుకు పెరుమండ్ల శివసాయి(21) ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 24న శ్రీనివాస్ మనుమడి అన్నప్రాసన కార్యక్రమం ఉండడంతో శివసాయి హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చాడు. రెండురోజుల తర్వాత హైదరాబాద్ వెళ్తానని చెప్పడంతో తండ్రి శ్రీనివాస్ వెళ్లొద్దని వారించాడు. హైదరాబాద్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి డబ్బులు ఖర్చు చేస్తున్నావని అనడంతో తండ్రి, కొడుకుల మధ్య గొడవ జరిగింది. దీనికి తోడు ఉన్న కొద్దిపాటి భూమిని అమ్ముతానని శివసాయి తండ్రికి చెప్పడంతో అది మనసులో పెట్టుకున్న శ్రీనివాస్, శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కొడుకు పడుకోవడం చూసి రోకలి బండతో తలపై కొట్టి చంపాడు. తర్వాత కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ ప్రదీప్ పరిశీలించారు.

కావేరీ సీడ్ కంపెనీలో పోలీసుల తనిఖీలు

శంకరపట్నం, ఏప్రిల్ 26: మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద గల కావేరీ సీడ్ కంపెనీలో కేశవపట్నం పోలీసులు, సాయుధ బలగాలు తనిఖీలు నిర్వహించాయి. సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డితో కలిసి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. కావేరీ ప్లాంట్‌లో పని చేసే సిబ్బంది తమ గదుల్లో ఏవైనా మత్తు పదార్థాలను కలిగి ఉన్నారా.. అనే కోణంతో పాటు ఆధార్ కార్డ్స్, ఐడీ కార్డులు చెక్ చేశారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి వారి వివరాలు సేకరించారు. ప్రతి వర్కర్‌కు తప్పనిసరిగా ఐడీ కార్డులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఎన్నికల దృష్ట్యా ఆముదాలపల్లి వద్ద, మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు పంపిణీ

విద్యానగర్, ఏప్రిల్ 26: ప్రమాదంలో మృతి చెందిన ఖాతాదారుడి కుటుంబానికి గాయత్రి బ్యాంక్ అధికారులు రూ. లక్ష బీమా చెక్కును శుక్రవారం కరీంనగర్‌లో పంపిణీ చేశారు. బ్యాంకు ఖాతాదారుడైన ఎంద్ర రాములు ఇటీవల ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు సీనియర్ డివిజనల్ మేనేజర్ పుల్లూరి స్వామి, బ్రాంచ్ మేనేజర్ జీ అశోక్, జూనియర్ ఆఫీసర్ విష్ణుప్రసాద్ బీమా చెక్కును అందించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 26 : పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన 'ఎడ్ టాక్స్' కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు ప్రారంభించారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణతో పాటు డాక్టర్ నిఖిల్, డాక్టర హరిప్రసాద్, డాక్టర్ మురళి, డాక్టర్ వీ రామచందర్ రావు, జ్యోతి, కే రవీంద్రాచారి, అనంతాచారి, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆటో డ్రైవర్ల వినతి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 26: తమ సమస్యలను పరిష్కరించాలని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నగర కమిటీ అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు కలెక్టర్ పమేలా సత్పతికి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, టీఎస్ ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు కిరాయిలేక ఆర్థిక ఇబ్బందులకు పడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆత్మహత్య చేసుకున్న 50 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని, ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ 15వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఇక్కడ ఆటో యూనియన్ నాయకులు మహేందర్, శ్రీనివాస్, నసీరొద్దీన్ ఉన్నారు.

మోదీ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదు

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడిలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి/ సైదాపూర్, ఏప్రిల్ 26: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో, సైదాపూర్ మండలకేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీగా కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ ఐదేండ్లలో చేసిందేమీ లేదన్నారు. ప్రధాని మోదీ రోజు రోజుకూ దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, ఎన్నికల కోసం రాముడి ఫొటోలు వాడుకుంటూ మాయమాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీటీసీ గీకురు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

'మాదిగలను అవమానించిన కాంగ్రెస్'

కార్పొరేషన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించి అవమానించిందని రాష్ట్ర దళిత సంఘాల నాయకుడు, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో దళితసంఘాల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగం మారుస్తామంటున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పేలా మాదిగలందరూ పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ మొదటి నుంచి మాదిగలకు అనుకూలంగా ఉందన్నారు. మాదిగల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలని కోరారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు క్రాంతి, నవీన్, అసంపల్లి వినయ్, అంజి, మహేందర్, రమేశ్, ఆంజనేయులు, రాజు, పవన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 26 : కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో అందించే హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎస్.చరణ్ తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై, జూలై 16,2024 నాటికి జనరల్ కేటగిరీలో 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో 25 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ కళాశాలలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు తొమ్మిది సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థుల ఈఏడాది జూన్ 24లోగా నిర్ణీత ప్రొఫార్మాలో తమ దరఖాస్తును పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గల ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ 524132 పిన్‌కోడ్ నంబర్‌పై నేరుగా పంపవచ్చని, లేదా నగరంలోని మంకమ్మతోటలో గల పొన్నం కాంప్లెక్స్‌లో ఉన్న తమ కార్యాలయంలో అందజేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. పూర్తి వివరాల కోసం www.lihtbargarh.org.in లో సంప్రదించాలని తెలిపారు.

నేషనల్ హ్యాండ్‌లూమ్ అవార్డులకు

కలెక్టరేట్, ఏప్రిల్ 26 : చేనేత రంగంలో విశిష్ట ప్రతిభా, నైపుణ్యాలు కనబరుస్తూ, సేవలందించిన చేనేత కళాకారులకు అందించే సంత్ కబీర్, నేషనల్ హ్యాండ్లూమ్ అవార్డు 2023 కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ తెలిపారు. ఔత్సాహికులు www.handlooms.nic.in లో గల నిర్ణీత బీ1, బీ2 దరఖాస్తు ఫారాలు నింపి మూడు సెట్‌లను హైదరాబాద్‌లోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌లో అందజేయాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక

శివజ్యోతి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 26 : జిల్లా కేంద్రంలోని జ్యోతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు అకేనపల్లి శివజ్యోతి రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యావేత్తల నుంచి రాష్ట్ర విద్యాశాఖ సైన్స్ అంశాలపై పరిశోధన పత్రాలను ఆహ్వానించింది. ఈ క్రమంలో 'జీవన వైవిధ్యం, పర్యావరణ విజ్ఞాన విద్య సుస్థిరత, పర్యావరణపై అవగాహన' అంశంపై శివజ్యోతి పరిశోధన పత్రం సమర్పించారు. ఇంట్లో ఉండే సహజ పదార్థాలతో అందాన్ని మెరుగు పరుచుకొని ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు. దీంతో శివజ్యోతిని సెమినార్‌కు ఎంపిక చేయగా, ఈ సందర్భంగా ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, భరోసా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అకేనపల్లి నాగరాజు, సభ్యులు నలమాచు విజయప్రసాద్, తాటిపల్లి సతీశ్ బాబు, మల్యాల వేణుగోపాల్ తదితరులు అభినందించారు.

లంక శేఖర్‌పై రౌడీ షీట్

రాంనగర్, ఏప్రిల్ 26: కరీంనగర్ విద్యారణ్యపురికి చెందిన లంక శేఖర్ (52)పై శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఓపెన్ చేశామని ఇన్‌స్పెక్టర్ ఏ ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అతడు వరుస నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుండడంతో రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ నివేదిక పంపారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రతిపాదన మేరకు రూరల్ ఏసీపీ అనుమతించగా, రౌడీ షీట్ ఓపెన్ చేసి లంక శేఖర్ కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు అతడు నాలుగు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

కరీంనగర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

రాంనగర్, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు మరింత పటిష్ట చర్యలు చేపడుతున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం , గంజాయి ఇతర పంపిణీ వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కరీంనగర్‌లోని బస్ స్టాండ్ , రైల్వే స్టేషన్, వాహన తనిఖీలు ఇతర రద్దీ ప్రదేశాల్లో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడి పట్టుబడ్డ వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తాగుడుకు బానిసై ఆమెను రోకలిబండతో కొట్టి హత్య చేసిన నేరంలో నిందితుడైన భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బీ ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతకు మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం జరిపారు. ఏడాదిన్నర తర్వాత బక్కయ్య ఇంటిముందు ఉన్న మహ్మద్ సాబీర్ (30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ ఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకు దెరువు కోసం చొప్పదండి మండలం మంగళపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబం సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తున్నది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవపడి ఆమెను రోకలిబండతో తీవ్రంగా గాయపరచడంతో ఆమె దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ ఘటనపై బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా, చొప్పదండి పోలీసులు సాబీర్‌పై హత్యా నేరం కేసు నమోదు చేయగా అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. ఈ కేసులో సీడీవోగా కే మధుసూదన్ వ్యవహరించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి.. నిందితుడు సాబీర్‌కు జీవితఖైదుతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.